# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2023** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు తెలంగాణలోని నిజామాబాద్‌లో పర్యటించి, 8 వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో సీబీఎస్ఈ గుర్తింపు ఉన్న వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతులకు పరీక్షల విధానంలో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.**

**3.** **తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం వేతన సవరణ సంఘం..పీఆర్‌సీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.**

**4.** **ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 62 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ.. ఎన్‌ఐఏ నిన్న ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ముంచింగిపట్టు మావోయిస్టు కేసులో భాగంగా తనిఖీలు చేశామని పేర్కొంది.**

**5.** **అలిపిరి నుంచి తిరుమల నడక మార్గంలో వన్య మృగాల నుంచి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధ్రువీకరిస్తేనే 12 ఏళ్ల లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టంచేశారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు తెలంగాణాలోని నిజామాబాద్‌లో పర్యటించి, 8 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మధ్యాహ్నం 2 గంటల 55 నిమిషాలకు నిజామాబాద్ చేరుకోనున్న ఆయన గిరిరాజ్ కళాశాల మైదానంలో వేర్వేరుగా ఏర్పాటుచేసిన అధికారిక కార్యక్రమాలు, బహిరంగ సభల్లో పాల్గొంటారు. సభా వేదిక పైనుంచి వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు చేస్తారు. రామగుండంలో ఎన్టీపీసీ 6 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన విద్యుత్తు ప్రాజెక్టును ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. 1,200 కోట్ల రూపాయల వ్యయంతో మనోహరాబాద్-సిద్దిపేట మధ్య నిర్మించిన 76 కిలోమీటర్ల కొత్త రైలు మార్గం, 305 కోట్ల రూపాయలతో మన్మాడ్-ముద్కేడ్-మహబూబ్‌నగర్-డోన్ మధ్య చేపట్టిన రైల్వేలైన్ల విద్యుదీకరణ ప్రాజెక్టును, సిద్దిపేట-సికింద్రాబాద్ మార్గంలో తొలి రైలు సర్వీసును ఆయన వర్చువల్‌గా ప్రారంభిస్తారు. వీటితోపాటు సుమారు ఒక వెయ్యా 360 కోట్ల రూపాయలతో 496 బస్తీ దవాఖానాల ఏర్పాటు, ఆయుష్మాన్ భారత్ కింద పలు జిల్లా కేంద్రాల్లో 50 పడకలతో నిర్మించే 20 క్రిటికల్ కేర్ విభాగాల పనులను ప్రారంభిస్తారు. అనంతరం ఇందూరు జన గర్జన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సీబీఎస్ఈ గుర్తింపు ఉన్న వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతులకు పరీక్షల విధానంలో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఫార్మెటివ్, సమ్మేటివ్ పరీక్షలుండగా వాటిని పీరియాడిక్, టర్మ్ పరీక్షలుగా మార్చింది. పీరియాడిక్ రాత పరీక్ష..పీడబ్ల్యూటీ–2 ఈ నెల 6వ తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్నారు. పీడబ్ల్యూటీలు మొత్తం నాలుగు ఉండగా... టర్మ్ పరీక్షలు రెండు ఉంటాయి. టర్మ్ పరీక్షలో 80 మార్కులకు రాత, 20 మార్కులకు అంతర్గత పరీక్షలుంటాయి. పీడబ్ల్యూటీలో 40 మార్కులకు రాత, 10 మార్కులకు అంతర్గత పరీక్షలుంటాయి. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులోనూ 33 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. పదో తరగతిలో అయిదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. మొదటి భాషగా ఆంగ్లం, రెండో భాషగా తెలుగు ఉంటుంది. మూడో భాష హిందీ ఉండదు. ఆరో సబ్జెక్టుగా స్కిల్ సబ్జెక్టును అమలు చేయనుండగా 50 మార్కులు థియరీ, 50 మార్కులు ప్రాక్టికల్స్ ఉంటాయి.

---------------------------

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వేతన సవరణ సంఘం..పీఆర్‌సీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్ ఛైర్మన్‌గా పీఆర్‌సీని ఏర్పాటు చేశారు. మరో విశ్రాంత అధికారి బి.రామయ్యను సభ్యుడిగా నియమించారు. ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి ఆరు నెలల్లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. అప్పటివరకూ ఉద్యోగులకు 5 శాతం మధ్యంతర భృతి.. ఐఆర్ ఇవ్వాలని నిర్ణయించింది.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 62 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ.. ఎన్ఐఏ నిన్న సోదాలు నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పౌరహక్కుల నాయకులు, అమరబంధు మిత్రుల సంఘం నాయకుల ఇళ్లలో అధికారులు తనిఖీలు జరిపారు. మావోయిస్టు సంఘాలతో సంబంధాల కేసులో ఈ సోదాలు చేశారు. సోదాలకు సంబంధించిన వివరాలతో ఎన్ఐఏ ప్రకటన విడుదల చేసింది. ముంచింగిపట్టు మావోయిస్టు కేసులో భాగంగా తనిఖీలు చేశామని పేర్కొంది. ఈ తనిఖీల్లో ఒకరిని అరెస్టు చేయగా.. ఆయుధాలు, నగదు, విప్లవ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో వచ్చిన 912 బహుమతులు, జ్ఞాపికలను వేలానికి ఉంచారు. ఈ ప్రక్రియ నిన్నటి నుంచి ప్రారంభమై.. ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనుంది. దీని ద్వారా వచ్చిన సొమ్మును గంగా నది శుద్ధి కార్యక్రమం 'నమామి గంగే ప్రాజెక్టు'కు అందిస్తారు. వేలం ప్రక్రియ వివరాలను కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి నిన్న ఢిల్లీలో పాత్రికేయులకు వివరించారు. ఈ–వేలంలో పౌరులు పాల్గొని 'నమామి గంగే ప్రాజెక్టు'కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆసక్తి కలవారు జూఎవఎవత్శీం.స్రశీజ.ఱఅ ను సందర్శించి వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చు.

---------------------------

అలిపిరి నుంచి తిరుమలకు వచ్చే నడక మార్గంలో వన్య మృగాల నుంచి ఎలాంటి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధ్రువీకరిస్తేనే 12 ఏళ్ల లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టంచేశారు. అప్పటి వరకు నడక మార్గంలో చిన్నారుల అనుమతిపై ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు. తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో నిన్న ఆయన క్యూలైన్‌లను పరిశీలించారు.

అనంతరం కరుణాకర రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ.. పెరటాశి మాసం, సెలవుల కారణంగా నాలుగు రోజులుగా తిరుమలలో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని తెలిపారు. భక్తులకు త్వరితగతిన స్వామి వారి దర్శనం చేయించాలనే సంకల్పంతో వీఐపీ బ్రేక్, సుపథం, స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీ కూడా రద్దు చేశామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నిన్న సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన ఎటువంటి ఆహారం తీసుకోకుండా నిరసన తెలిపారు. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న స్నేహబ్లాక్‌లోని గదిలోనే దీక్ష చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తనపై కేసులు నమోదు చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ జైల్లోనే ఆయన దీక్ష చేశారు. కాగా.. గవర్నర్ ముందస్తు అనుమతి లేకుండా తనపై పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై ఈ రోజు సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

---------------------------

తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆయన సతీమణి భువనేశ్వరి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిన్న 'సత్యమేవ జయతే దీక్ష' చేపట్టారు. సత్యమేవ జయతే, అహింస నినాదాలను నమ్ముతానని.. అందుకే న్యాయం కోసం ఈ దీక్ష చేపట్టానని ఆమె తెలిపారు. ఈ దీక్షలో పాల్గొన్నది తమ కుటుంబం కోసం కాదని.. ప్రజలందరి కోసమని భువనేశ్వరి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యల గురించి ప్రజలందరికీ చెప్పడానికే దీక్ష చేపట్టానని వెల్లడించారు. భారీగా తరలివచ్చిన మహిళలు, ప్రజలను ఉద్దేశించి దీక్ష విరమణ అనంతరం భువనేశ్వరి భావోద్వేగంతో ప్రసంగించారు. కాగా.. చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆ పార్టీ శ్రేణుల, అభిమానులు నిన్న నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు.

---------------------------

తెలంగాణలోని మనోహరాబాద్-సిద్దిపేట మధ్య రైలు సర్వీసు ఈరోజు ప్రారంభమవుతుందని ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. త్వరలోనే తిరుపతి, బెంగళూరు నగరాలకు రైలు సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. సిద్దిపేటలో నిన్న ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన వెయ్యి పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామని, త్వరలోనే సిద్దిపేటలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తామని హరీశ్‌రావు తెలిపారు.

---------------------------

తెలుగుదేశం పార్టీతో జనసేన పొత్తు వల్ల వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఈ కూటమి గెలుస్తుందన్న నమ్మకం ప్రజల్లో కలిగిందని జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ తెలిపారు. వారాహి నాలుగో విడత యాత్రలో భాగంగా నిన్న ఆయన కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ, జనసేన పొత్తు ప్రజలు నిర్ణయించిందని పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రజల కోసమే పనిచేయాలని.. వ్యక్తిగత లెక్కలేమీ ఉండవని స్పష్టంచేశారు. జనసేన రోడ్లపై పోరాటం చేసే పార్టీగా మిగిలిపోకూడదని.. రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

====================